భక్తితోనే ముక్తి

బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న ఎంపీ ఈటల రాజేందర్, శ్రీనివాస్‌యాదవ్



అల్లాపూర్ డివిజన్ శ్రీవివేకానందనగర్‌లోనిభూనీల సమేత వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్స వాల్లో భాగంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భక్తితోనే ముక్తి లభిస్తుందని అన్నారు. శ్రీవారిని భక్తిశ్రద్ధలతో పూజిస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని అన్నారు. ఈ ఉత్సవాల్లో మూసాపేట కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు, ఆలయ కమిటీ వ్యవస్థాపక చైర్మన్ వెలుగుల శ్రీనివాస్‌యాదవ్, శ్రీలక్ష్మీయాదవ్, దస్తయ్య, పులిగొల్ల అంజమ్మ, ఏడుకొండలు, రామకృష్ణ, హరికృష్ణ, రమేష్, ప్రకాష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

– మోతీనగర్

5కే రన్

ఆల్విన్‌కాలనీ డివిజన్ శంషీగూడ శిల్పా బృందావనంలో కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 5కే మారథాన్ నిర్వహించారు. సభ్యులందరూ పసుపు రంగు దుస్తులు ధరించి అందమైన ఉదయాన్ని ఆస్వాదించారు. ప్రతి ఒక్కరూ పోటీ పడుతూ 5కే రన్‌ను దిగ్విజయం చేశారు. ఈ సందర్భంగా 5కే రన్‌లో ప్రతిభ కనబరిచిన వారికి అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు నాగేశ్వరరావు, సెక్రటరీలు శశికర్, వెంకట్‌చంద్ర, సతీష్ రావు, అశ్విని క్లినిక్, ఇంటిగ్రేస్, ఇన్ఫుర్, వీఈసీ, సైలోటెక్, డా. అబ్దుల్ కలాం స్కూల్, ఆస్ట్రా సింథసిస్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

– ఆల్విన్‌కాలనీ



ఫాదర్స్ డే

డాక్టర్ రావూస్ ఈఎన్‌టీ వైద్యశాలలో ఫాదర్స్ డే వేడుకలు



కేపీహెచ్‌బీకాలనీలోని డాక్టర్ రావూస్ ఈఎన్‌టీ వైద్యశాలలో ఫాదర్స్ డే వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. వైద్యశాల ఆధ్వర్యంలో ఉచితంగా నిర్వహించిన కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీ విజయవంతంగా పూర్తి చేసిన చిన్నారులు తల్లిదండ్రులతో కలిసి ఫాదర్స్ డే వేడుకలు జరిగాయి. వేడుకలకు ముఖ్యఅతిథులుగా వైద్యశాల చైర్మన్ డాక్టర్ జీవీఎస్ రావు, ఎండీ చైతన్యరావు, డైరెక్టర్ శ్రీరాములు పాల్గొని చిన్నారులతో కలిసి కేక్ కట్ చేశారు. చిన్నారులకు స్కూల్ బ్యాగ్, కంపాక్స్ బాక్స్, లంచ్ బాక్స్, పెన్సిల్‌తో కూడిన కిట్‌ను అందజేశారు.

– కేపీహెచ్‌బీకాలనీ

ఎల్‌ఐజీ ప్లాట్స్‌పై పెంచిన ఫైనల్ కాస్ట్‌ను రద్దు చేయాలి



కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్‌కు వినతి పత్రం అందజేసిన అసోసియేషన్ సభ్యులు

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ కాలనీ 4వ ఫేజు వెంచర్–2లోని 630 ఎల్‌ఐజీ ప్లాట్స్‌పై పెంచిన 63శాతం ఫైనల్ కాస్ట్‌ను రద్దు చేసి వెంటనే ప్లాట్స్‌ను రిజిస్ట్రేషన్ చేయాలని స్థానికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్‌ను ఆయన నివాసంలో కలిసి వినతిప్రతం సమర్పించారు. ఫోర్త్ ఫేజ్ వెంచర్–2లో హౌసింగ్ బోర్డు వారు 630 ఎల్‌ఐసీ ప్లాట్స్‌ను నిర్మించి వీటిని లబ్ధిదారులకు అందజేశారు. వీటి ఫైనల్ కాస్ట్ 63 శాతంగా నిర్ణయించటంలో ఇంత వరకు ఇవి రిజిస్ట్రేషన్ కాలేదు. పెంచిన ధరను తగ్గించి తాత్కాలిక ధరకే రిజిస్ట్రేషన్ చేయాలని వినతిపత్రం అందజేశామన్నారు. దీనిపై గత ప్రభుత్వంలోనూ ఫిర్యాదు చేశామని తెలిపారు. సమస్య ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందన్నారు. దీంతో పాటు వెంచర్ ప్రారంభంలో ఇక్కడ కమ్యూనిటీహాల్ నిర్మిస్తామని హౌసింగ్ బోర్డు అధికారులు హామీ ఇచ్చారని తెలిపారు. అయినా ఇప్పటి వరకు పట్టించుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు పెద్ది రాజు, రవి చావా, శరత్ బాబు, సూరిబాబు, నిరంజన్‌రెడ్డి, సుధీర్, మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మిత్రాహిల్స్‌లోని పార్కును అభివృద్ధి చేయాలి



రవికుమార్ యాదవ్‌కు వినతిపత్రం అందజేస్తున్న మిత్రాహిల్స్ కాలనీ సభ్యులు

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని మిత్రాహిల్స్‌లో ఉన్న పార్కును అభివృద్ధి చేయాలని కాలనీవాసులు ఆదివారం శేరిలింగంపల్లి బీజేపీ ఇన్‌చార్జి రవికుమార్ యాదవ్‌కు వినతిపత్రం అందజేశారు. మిత్రాహిల్స్‌లోని పార్కు పర్యవేక్షణ లోపంతో అంధ విహీనంగా మారిందని తెలిపారు. పిచ్చి మొక్కలు పెరిగి.. చెత్తా చెదారం పేరుకుపోయి విష పురుగులు, పాములు సంచరిస్తున్నాయని పేర్కొన్నారు. అంతేకాకుండా కాలనీలో నీటి ఎద్దడి ఎక్కువగా ఉందన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. అనంతరం రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ.. త్వరలోనే ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని కలిసి సమస్యను వివరిస్తానన్నారు. కాలనీలో పర్యటించి పార్కును అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. తాగునీటి సమస్యను కూడా అధికారులతో మాట్లాడి శాశ్వతంగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో భరత్, మహేందర్, సురేష్, సీతారామరాజు తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికలో చెత్తాచెదారం తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..



వి.రామారావునగర్‌లోని శ్మశానవాటికను శుభ్రం చేస్తున్న డీఆర్‌ఎఫ్‌స్ సిబ్బంది

మోతీనగర్: ‘కబ్రస్థాన్‌ను పట్టించుకోండి’ అనే శీర్షికతో ఆదివారం కూకట్‌పల్లి జోన్‌లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ముస్లిం శ్మశాన వాటికలో ఎండిపోయిన కొమ్మలు, చెత్తాచెదారాన్ని ఆదివారం డీఆర్‌ఎఫ్ సిబ్బంది తొలగించారు. ఈ సందర్భంగా ముస్లింలు ‘సాక్షి’కి కృతజ్ఞతలు తెలిపారు.

మాదకద్రవ్యాల విక్రయాలను అరికట్టాలి



ఎమ్మెల్యే గాంధీకి వినతిపత్రం సమర్పిస్తున్న గోకుల్ ప్లాట్స్ సాయిహిల్స్ కాలనీవాసులు

హఫీజ్‌పేట్: మాదాపూర్ డివిజన్ పరిధిలోని గోకుల్ ప్లాట్స్ కాలనీలోని సాయిహిల్స్ కాలనీలో మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలు, గుట్కాలు, గంజాయి వంటివి విక్రయిస్తున్నారని వాటిని అరికట్టాలని ఆదివారం కాలనీ వాసులు ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీని కలిసి వినతి ప్రతం అందించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ.. గోకుల్ ప్లాట్స్‌లో సుమారు 300 కుటుంబాలు నివాసముంటున్నారని కాలనీకి ఆనుకొని ఉన్న హౌసింగ్ బోర్డు స్థలంలో బడ్డీ కొట్టు నిర్వహిస్తున్నారన్నారు. ఆ కొట్టులో సిగరెట్లు, మత్తు పదార్థాలు, గుట్కాలు, గంజాయి వంటివి విక్రయిస్తున్నారన్నారు. దీన్నే అదునుగా చూసుకొని వివిధ ప్రాంతాల నుంచి యువకులు వచ్చి మత్తుపదార్థాలతో పాటు గంజాయి సేవిస్తున్నారన్నారు. ఆ ప్రాంత మహిళలు కొట్టు ముందు వెళ్తుంటే వారిపట్ల యువకులు అసభ్యంగా ప్రవరిస్తున్నారన్నారు. ఈ విషయంపై కాలనీ వాసులు కొట్టు నిర్వహకులను అడడగా తిరగబడి తమను దూషిస్తున్నారన్నాని ఎమ్మెల్యేకు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మాదకద్రవ్యాలు అమ్ముతున్న వారిపై ఉక్కుపాదం మోపుతామని, మత్తు పదార్థాలు, గంజాయి వంటి అమ్మకాలు చేస్తున్న కొట్టు నిర్వహికులతో పాటు ఎంతటి వారినైనా ఉపేక్షించే ప్రసక్తే లేదన్నారు.

గ్రీన్ ఎనర్జీ క్లబ్‌లో చేరిన బ్రిక్స్ స్కైవుడ్ అపార్ట్‌మెంట్



సోలార్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న జగదీశ్వర్‌గౌడ్

రాయదుర్గం: గ్రీన్ ఎనర్జీ క్లబ్‌లో గచ్చిబౌలి డివిజన్ గోపన్‌పల్లిలోని బ్రిక్స్ స్కైవుడ్ అపార్ట్‌మెంట్ చేరింది. అపార్ట్‌మెంట్‌లో 234 కిలోవాట్ల ఉత్పత్తి సామర్థ్యంతో కూడిన సోలార్ ప్లాంట్‌ను ఆదివారం ప్రారంభించారు. ఈ సోలార్‌ప్లాంట్‌ను అపార్ట్‌మెంట్‌వాసులతో కలిసి శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వి జగదీశ్వర్‌గౌడ్ ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో జగదీశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ సోలార్‌పవర్ ప్లాంట్‌ను అపార్ట్‌మెంట్‌లో ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. అపార్ట్‌మెంట్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి రాజ్‌కుమార్, అసోసియేషన్ సోలార్ కమిటీ సభ్యుడు పివిరెడ్డి పాల్గొన్నారు.

సర్కారు సేవలు అంతంతే..!

- ప్రభుత్వాసుపత్రుల్లో సమస్యల తిష్ట
- సీహెచ్‌సీ, పీహెచ్‌పీ, బస్తీ దవాఖానాల్లో వైద్యులు, సిబ్బంది కొరత
- ఉన్నవారిపై అదనపు భారంతో సతమతం
- సౌకర్యాలు కరువు.. పట్టని పర్యవేక్షణ
- సమయపాలన పాటించకపోవడంతో రోగుల కష్టాలు
- ప్రైవేట్ ఆసుపత్రుల వైపు పరుగు

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని సర్కారు దవాఖానల్లో సమస్యలు తిష్ట వేశాయి. ‘అన్ని ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లు’ గా జిల్లాలో సంఖ్యాపరంగా ప్రభుత్వాసుపత్రులు ఉన్నా.. వైద్యులు, సిబ్బంది, సబ్ స్టాఫ్ పోస్టుల సిబ్బంది కొరతతో పాటు సరైన పర్యవేక్షణ లేక రోగులు ప్రైవేట్ ఆసుపత్రులకు పరిగెత్తాల్సి వస్తోంది. ఇదే పరిస్థితి గ్రామీణ, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, పల్లె, బస్తీ దవాఖానాల్లోనూ కనిపిస్తోంది. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో మల్కాజిగిరి జిల్లా కేంద్ర ఆసుపత్రితో సహా ఘట్‌కేసర్ కమ్యూనిటీహెల్త్ సెంటర్ ద్వారా రోగులు అంతంతమాత్రంగానే సేవలు పొందుతున్నారు. అలాగే 26 ప్రభుత్వ పట్టణ ఆరోగ్య కేంద్రాలు, 12 గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు, 70 పల్లె , 112 బస్తీ దవాఖానాలు కూడా ప్రజలకు అరకొర సేవలు అందిస్తున్నాయి. దాదాపు ఏడాది కిందట మేడ్చల్, శామీర్‌పేట ఆసుపత్రులను కమ్యూనిటీ హెల్త్ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేసినప్పటికీ ఇప్పటివరకు సరిపడా వసతులు, సరిపడా వైద్యులు, సిబ్బంది లేకపోవడం మరోవైపు బెడ్‌లు లేకపోవటంతో పూర్తి స్థాయిలో రోగులకు సేవలు అందించలేకపోతున్నాయి.



మంజూరు పోస్టులకు దిక్కేది..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో పెరిగిన జనాభా, కాలనీలకు అనుగుణంగా ఆసుపత్రులకు మంజూ రు చేసిన పోస్టుల భర్తీ చేపట్టలేదు. దీంతో ప్ర స్తుతం పని చేస్తున్న డాక్టర్లు, వైద్యాధికారులు, సి బ్బందిపై అదనపు భారం పడుతోంది. ఖాళీగా ఉ న్న 35 మంది డాక్టర్లతో సహా 113 పారా మెడిక ల్, 32 ల్యాబ్ టెక్నీషియన్లు, 109 సబ్ స్టాఫ్ , 130 నర్సుల పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. జి ల్లాలో 3 వేల మంది ఆశవర్కర్స్ పని చేయాల్సి ఉండగా 340 మంది మాత్రమే ఉన్నారు. అలాగే అప్‌గ్రేడ్ చేసిన మేడ్చల్, శామీర్‌పేట సీహెచ్‌సీల్లో 20 మంది వైద్యులు, 24 మంది స్టాఫ్ నర్సులు, 10 పారామెడికల్ సిబ్బందిని నియమించాల్సి ఉంది.

పర్యవేక్షణ లేక.. నిర్లక్ష్యం

జిల్లాలోని పలు గ్రామీణ, అర్బన్ ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో పర్యవేక్షణ కొరవడడంతో డాక్టర్లు, సిబ్బంది సమయ పాలన పాటించకపోవడంతో రోగులు వైద్య పరీక్షలు, ఇతర సేవల కోసం నిరీక్షించాల్సి వస్తోంది. సాధారణ జబ్బులు, జ్వరం, దగ్గు, ఒళ్లు నొప్పులకు సంబంధించిన మందులు అడపాదడపా లభించినప్పటికీ, సీజనల్ వ్యాధులకు సంబంధించిన మందులు అందుబాటులో లేకపోవడంతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు.

24 గంటల ఆసుపత్రుల్లోనూ..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 24 గంటలు (రౌండ్‌ది క్లాక్) ఆసుపత్రులు 12 ఉండగా, ఇందులో నాలుగు ఆసుపత్రుల్లో డాక్టర్లు, సిబ్బంది అందుబాటులో లేకపోవడం, మరికొన్నింటిలో ఆలస్యంగా వారు రావడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఆసుపత్రులకు వచ్చినా మందులు లేకపోవడంతో రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సేవలు అంతంతే..

ప్రభుత్వ ఆసుపత్రుల్లో కొందరు డాక్టర్లు, సిబ్బంది నిర్లక్ష్యం వల్ల రోగులకు వైద్యం అందడం లేదని ఆందోళన చెందుతున్నారు. మల్కాజిగిరి, ఘట్‌కేసర్, శామీర్‌పేట, మేడ్చల్ ఆసుపత్రులతో పాటు పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా ఆసుపత్రులు సహా పల్లె , బస్తీ దవాఖానాల్లో కూడా సమయ పాలన పాటించకపోవడంతో రోగులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు 12 ఉండగా ఇందులో 11 కేంద్రాల్లో ప్రసవాలు చేస్తున్నప్పటికీ డాక్టర్లు అందుబాటులో లేని కారణంగా గర్భిణులు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అలాగే 26 పట్టణ ఆరోగ్య కేంద్రాలు ఉండగా ఇందులో ఆరింటిలో ప్రసవాలు చేస్తున్నామని జిల్లా వైద్యారోగ్యశాఖ పేర్కొంటున్నప్పటికీ ఆచరణలో అమలుకు నోచుకోవడం లేదని తెలుస్తోంది. జిల్లా వైద్యారోగ్యశాఖ పర్యవేక్షణ సరిగా లేకపోవటంతోనే ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు సేవలు పూర్తి స్థాయిలో అందడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా జిల్లా అధికార యంత్రాంగం ప్రభుత్వ ఆసుపత్రులు , పీహెచ్‌సీలు, పల్లె, బస్తీ దవాఖానాల్లో ఖాళీలు భర్తీ చేసి సౌకర్యాలు కల్పించి వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

శ్రీలలితా సహస్ర నామ పారాయణం

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్‌లోని అయ్యప్పస్వామి దేవాలయ ప్రాంగణంలోని వీవీ స్ఆర్ వేదికలో ఆదివారం సింగపూర్‌కోటి శ్రీలలితా సహస్రనామ పారాయణం అరుణ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొన్నారు. అనంతరం కార్యక్రమ నిర్వాహకులు రాజేశ్వరరావును శాలువాతో సత్కరించారు.

ఘనంగా రేణుకాఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం



పూజల్లో పాల్గొన్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: డివిజన్ పరిధిలోని ఎల్లమ్మ చెరువు వద్ద ఉన్న రేణుకాఎల్లమ్మ దేవాలయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ సూర్యారావు, సభ్యులు పాల్గొన్నారు.

బక్రీద్ శుభాకాంక్షలు

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ



ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఈద్గాల వద్ద, మసీదుల వద్ద అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. ప్రశాంత వాతావరణంలో పండుగ నిర్వహించుకునేలా అన్ని ఏర్పాట్లు చేయాలని ఇప్పటికే అధికారులకు ఆదేశించామన్నారు.

భవిష్యత్ బాగుండాలంటే ప్రకృతిని కాపాడుకోవాలి

కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్



అంబీర్ చెరువు వద్ద మొక్కలు నాటిన పాట చిత్రీకరణ బృందంతో కార్పొరేటర్

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని అంబీర్ చెరువు వాకర్స్ అసోసియేషన్, షూట్ టు ఫైన్ ప్రొడక్షన్ ఆధ్వర్యంలో చెరువు సుందరీకరణ, మొక్కలు నాటే కార్యక్రమం ఆదివారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ హాజరై అసోసియేషన్ సభ్యులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో షూట్ టు ఫైన్ ప్రొడక్షన్ వారు ఫైట్ మాస్టర్స్ రామ్ లక్ష్మణ్ మాస్టర్స్ సహకారంతో ‘మనం మారిపోదం’అనే పాటను చిత్రీకరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవటం అందరి బాధ్యత అన్నారు. అంబీర్ చెరువు పరిసరాలను శుభ్రం చేసి, మొక్కలు నాటి పచ్చని వనంలా చెరువును సుందరీకరించడానికి స్వచ్ఛందంగా విచ్చేసిన వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, ప్రొడక్షన్ వారికి, శివమ్మ కాలనీ వాసులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల్లో చైతన్యం కల్పించడానికి పాటను చిత్రీకరిస్తున్నందుకు చిత్ర బృందాన్ని అభినందించారు. మన భావితరాలు బాగుండాలంటే ప్రకృతిని కాపాడి పచ్చదనాన్ని వారికి బహుమతిగా అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో శివరాజ్‌గౌడ్, కాయితి నరసింహులు, సిద్దయ్య, జక్కుల నరసింహ, గిరి, గోపి, మాస్టర్ వన్నెస్, సతీష్, రామచందర్, నవీన్, మాధవ్, వాసు, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సంగీత విభావరి



బహుమతులు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

హఫీజ్‌పేట్: మాదాపూర్ డివిజన్ పరిధిలోని గోకుల్ ప్లాట్స్ కాలనీలో మహేంద్ర అశ్విత అపార్ట్‌మెంట్స్‌లో అశ్విత వయోవృద్ధుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సంగీత విభావరి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ హాజరయ్యారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్, అపార్ట్‌మెంట్స్ వాసులు పాపారావు, మాధవరావు, ఎంఎస్ మూర్తి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న బీజేపీ కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్

మియాపూర్: కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్ పేర్కొన్నారు. మియాపూర్ లక్ష్మీనగర్ కాలనీలో నూతనంగా నియామకమైన అభివృద్ధి, సంక్షేమ సంఘ సభ్యుల శిలాఫలకాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీలో పర్యటించి స్థానికులకు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ సంఘ సభ్యులు కాలనీ అభివృద్ధికి పాటుపడాలని , సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నరసింహారెడ్డి, భూపాల్, సత్యనారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, పట్నాయక్, శ్రీనివాస్, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు



పాండురంగనగర్‌లోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవాలయం

మోతీనగర్: మూసాపేట డివిజన్ పాండురంగనగర్‌లోని శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 17 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ వీఎస్‌పీ సత్యనారాయణ, కార్యనిర్వహణ అధికారి జీఏకే కృష్ణ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాల ప్రారంభ సందర్భంగా ఈనెల 17వ తేదీ ఉదయం 9గంటలకు వేద విన్నపము, లక్ష్మీ పూజలు, తీర్థప్రసాద వితరణ, సాయంత్రం 5.30 గంటలకు విశ్వక్సేనపూజ, దీక్షా స్వీకారం, పుణ్యాహవచనం, సామూహిక విష్ణుసహస్రనామ స్తోత్ర పారాయణం, ధ్వజాధివాసం, తీర్థ ప్రసాద వినియోగం కార్యక్రమంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం అవుతాయని తెలిపారు. 19వ తేదీ ఉదయం 10.30 గంటలకు శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి శాంతి కల్యాణోత్సవం, మధ్యాహ్నం అన్నదానం వంటి కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

అందరూ భాగస్వాములవ్వండి

మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి



చెరువును శుభ్రం చేయడానికి సిద్ధమైన గ్రీన్‌ఆర్మీ ప్రతినిధులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): సేవ్ లేక్, సేవ్ వాటర్ ఉద్యమంలో భాగంగా తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని చెలికుంట చెరువు పరిసర ప్రాంతంలోని చెత్తను తెల్లాపూర్ నైబర్‌హుడ్ గ్రీన్ ఆర్మీ సభ్యులు తొలగించారు. మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డితో పాటు సుమారు 50మంది ఐటీ నిపుణులు, చిన్నారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రీన్‌ఆర్మీ ఆధ్వర్యంలో ప్రతిఆదివారం చెరువు పరిసర ప్రాంతంలో చెత్తను తొలగించే కార్యక్రమం చేపట్టడం హర్షణీయం అని ప్రశంసించారు. దీనిలో ప్రతి ఒక్కరు భాగ్యస్వాములు కావాలని పిలుపునిచ్చారు. చిన్నారులు సైతం ఈ కార్యక్రమంలో పాల్గొని వారి వంతుగా చెత్తను తొలగించారని చెప్పారు. అదేవిధంగా తాము కూడా పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని తెలిపారు.

ఉపాధి కల్పన మంచి పరిణామం

పటాన్‌చెరు టౌన్: యువత ప్రభుత్వ ఉద్యోగాల కోసం చూడకుండా సొంతంగా ఉపాధి పొందుతూ నలుగురికి ఉద్యోగాలు కల్పించే దిశగా సాగడం మంచి పరిణామం అని కాంగ్రెస్ నాయకుడు నీలం మధు ముదిరాజ్ అన్నారు. ఆదివారం ముత్తంగి పంచాయతీ పరిధిలో సిరి బ్యాంకెట్ హాల్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ యువత వ్యాపారంగంలో రాణిస్తూ ఉపాధికల్పనకు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో ఇస్నాపూర్ ఎంపీటీసీ గడ్డం శ్రీశైలం, అశోక్, సంజీవ్, నారాయణరెడ్డి, ప్రవీణ్, రాజు, బాలరాజు, అనిల్, కృష్ణ, మహిపాల్ రెడ్డి, నర్సింహ, వీరన్న, వెంకటేశ్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

ఈద్గాల వద్ద పటిష్ట బందోబస్తు

హఫీజ్‌పేట్: బక్రీద్ పండుగు పురస్కరించుకొని మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని న్యూ హఫీజ్‌పేట్‌లోని ఆదిత్యనగర్, ప్రేమ్‌నగర్ ఈద్గాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని మియాపూర్ ఇన్‌స్పెక్టర్ దుర్గా ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం ఆదిత్యనగర్, ప్రేమ్‌నగర్ ఈద్గాల వద్ద ఏర్పాటు చేయవలసిన భద్రతపై మియాపూర్ ఏసీపీ నర్సింహారావు, సీఐ దుర్గ ప్రసాద్‌లు పరిశీలించారు.

వాసవిక్లబ్ సేవా కార్యక్రమాలు

రాయదుర్గం: పలు సేవా కార్యక్రమాలను మణికొండలోని వాసవి క్లబ్ కపుల్స్ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ వాసవి ఆదేశాలపై ‘డాన్ టు డస్క్ సేవా’ కార్యక్రమాల్లో భాగంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం గచ్చిబౌలిడివిజన్‌లోని ఖాజాగూడలోని ప్రభుత్వ పాఠశాలకు వెయ్యి లీటర్ల సామర్థ్యం కలిగిన నీళ్ల ట్యాంకు, 20 మంది విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, కానిస్టేబుళ్ళకు మాస్కులు, టవల్స్, స్ట్రీట్ వెండర్‌కి గొడుగులు, ఆరు సభ్యుల చేత ఆర్గాన్ డోనర్ చేయించడం, వాసవి అమ్మవారి ఆలయంలో సేవా కార్యక్రమాలను వంటి సేవా కార్యక్రమాలను నిర్వహించారు.

ప్రభుత్వ భూమిని దున్నడంపై ఫిర్యాదు

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని ఖాజీపల్లి గ్రామంలోని 181సర్వే నంబర్‌గల ప్రభుత్వ భూమిలో కొంత మంది గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం దుక్కి దున్నారు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమిస్తూ దుక్కి దున్నడంపై స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. అందుకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు చెప్పారు.